క్లుప్తంగా

విద్యార్థులకు డైరీల పంపిణీ



మాధవపట్నం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు డైరీలు అందజేస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: విద్యార్థులు హైస్కూల్ స్థాయి నుంచి డైరీ రాయడం అలవాటు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వై శివరామకృష్ణయ్య అన్నారు. శనివారం మండల పరిధిలో మాధవపట్నం జిల్లా పరిషత్తు హైస్కూల్లోని 300 మంది విద్యార్థులకు పీపుల్స్ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గంగిరెడ్డి రచన, చరణ్ వారి కుమార్తె ఐరా పేరున డైరీలు అందజేశారు. ఈ సందర్భంగా శివరామకృష్ణయ్య మాట్లాడుతూ ప్రతి రోజు డైరీలో చదవ వలసిన పాఠ్యాంశాలు, చేయవలసిన పనులకు సంబంధించిన అంశాలు రాయడం ద్వారా చదువుపై శ్రద్ధ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం టి.మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, ట్రస్టు సభ్యులు సరేఖ, ప్రసాద్, త్రినాథ్, పవన్ కుమార్ సరోజ పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు నేడు యాంటీ రేబిస్ వ్యాక్సిన్

సామర్లకోట: పెంపుడు కుక్కలకు ఆదివారం మండల పశువైద్య కేంద్రంలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తారని లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు చిత్తూలూరి వీర్రాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ వలన ప్రయోజనాలను పశుసంవర్ధక శాఖ అధికారులు తెలియజేస్తారన్నారు. 12 ఏళ్లుగా ఏటా పశుసంవర్ధక శాఖకు 300 డోసుల యాంటీ రాబిస్ వ్యాక్సిన్ క్లబ్ మాజీ అధ్యక్షుడు సింగవరపు సత్యనారాయణ అందజేస్తున్నట్టు తెలిపారు. ఒక డోసు నాలుగు కుక్కలకు వస్తుందని చెప్పారు. జునోసిస్ డే సందర్భంగా అందించే ఈ యాంటీ రేబిస్ వ్యాక్సిన్ మండల పశు వైద్య కేంద్రంలో మూడు రోజుల పాటు వేస్తారని తెలిపారు. కుక్కల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం గాంధీచౌక్‌లోని రైతు భవనంలో నిర్వహిస్తున్నట్లు వీర్రాజు తెలిపారు.

సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

కొత్తపల్లి: దేశవ్యాప్తంగా 9న లేబర్ కోడ్ల రద్దు కోసం నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మండల సీఐటీయూ అధ్యక్షుడు నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని యండపల్లిలో శనివారం ఆయన సమ్మెకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాంబశివకుమార్, అప్పారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్‌గా పైడా



కన్యకా పరమేశ్వ దేవస్థానం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సత్య రామకృష్ణ

పెద్దాపురం: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్‌గా పైడా సత్య రామకృష్ణ నియమితులయ్యారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ దేవస్థానం చైర్మన్‌గా 25 ఏళ్లుగా కేదారిశెట్టి వెంకట్రావు బాధ్యతలు నిర్వహించారు. నూతన చైర్మన్‌గా సత్య రామకృష్ణ నియమితులు కావడంతో శనివారం ఆలయంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మట్టే సత్య ప్రసాద్, మట్టే శ్రీనివాస్, ఆదీష్, పాలకుర్తి రాజేష్, దేవత రాజేష్, మహిళా మండలి సభ్యులు, ఆర్యవైశ్యా సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరుపుల వితరణ



విద్యార్థులకు పరుపులు అందిస్తున్న తుమ్మలపల్లి నారాయణరావు

బోట్‌క్లబ్: స్థానిక నరసన్ననగర్‌లో సేవాభారతి ట్రస్ట్ సచికేత పిల్లల హాస్టల్లో విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ ఎలైట్ తరఫున తుమ్మలపల్లి నారాయణరావు సౌజన్యంతో 20 పరుపులను శనివారం అందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరావు చేతుల మీదుగా వాటిని అందజేశారు. బిక్కిన విశ్వేశ్వరావు మాట్లాడుతూ రానున్న చలికాలంలో విద్యార్థులు పడుకునేందుకు ఇబ్బంది పడకుండా దాతలు పరుపులు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పవన్, సెక్రటరీ స్రవంతి, క్లబ్ మాజీ అధ్యక్షుడు సత్యారెడ్డి, బీజేపీ నాయకులు యార్లగడ్డ రామ్‌కుమార్, గూడూరు పద్మ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి ఏర్పాట్లు

- నేడు పాండురంగ స్వామికి కల్యాణం
- ఆషాఢ మాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు



సామర్లకోటలో పాండురంగ స్వామి ఆలయం



ఆలయంలోని పాండురంగస్వామి



రుక్మిణీదేవి

సామర్లకోట: స్థానిక పాండురంగ స్వామి ఆలయంలో ఆదివారం కల్యాణ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు ఆలయానికి రంగులు వేసి, చలువ పందిర్లు, విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. సుమారు 190 ఏళ్ల క్రితం నిర్మితమైన ఈ ఆలయంలో ఏటా ఆషాఢ మాసం తొలి ఏకాదశి పర్వదినంలో రుక్మిణీ సమేత పాండురంగ స్వామి కల్యాణం నిర్వహిస్తారు. పాండురంగ స్వామిని దర్శించుకుంటే తమ కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. నూతన దంపతులు ఆషాఢ మాసంలో తొలి ఏకాదశి రోజున స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడం వలన సంతానం కలగడంతో పాటు ఆయురారోగ్యం, అష్టైశ్వర్యాలతో జీవిస్తారని నమ్మకం. ఆషాఢ మాసంలో నిర్వహించే ఉత్సవాలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీల కూడలి ప్రదేశంలో ఈ ఆలయం ఉంది. సామర్లకోటకు చెందిన అయోధ్యల కాటయ్య నాయుడు తన పొలంలో దుక్కి దున్నుతున్న సమయంలో పాండురంగ స్వామి, రుక్మిణీమాత విగ్రహాలు లభించడంతో వారి సొంత స్థలంలో ఆలయం నిర్మించి ఏటా తొలి ఏకాదశి రోజున పంచారామ క్షేత్ర వేద పండితులతో కల్యాణం నిర్వహిస్తారు. వంశ పారంపర్యంగా వారి కుటుంబ సభ్యులే ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు.

ఘనంగా ఉత్సవ నిర్వహణ



తాత కాటయ్య నాయుడు పొలం దున్నుతున్న సమయంలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలు బయట పడటంతో ఆలయం నిర్మించారు. ఆ ప్రాంతాన్ని నేడు పాండురంగపురంగా పిలుస్తున్నారు. మహారాష్ట్రలోని పండరీపురంలో ఉన్న పాండురంగస్వామి ఆలయంలో నిర్వహించే విధంగానే ఏటా ఆషాఢ మాసంలో ఇక్కడ కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తాం.

– అయోధ్యల రాజేశ్వరరావు, ధర్మకర్త, సామర్లకోట

నూతన దంపతులు పాల్గొనాలి



వివాహమై ఏడాది పూర్తి కాని నూతన దంపతులు పాండురంగ స్వామిని దర్శించుకోవాలి. స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తే మంచి జరుగుతుంది. అనుకున్న కార్యం సిద్ధిస్తుంది. దంపతులకు సంతాన యోగం కలుగుతుంది. ఆషాఢ మాసం తొలి ఏకాదశి రోజున ఉపవాస దీక్ష చేసి స్వామి వారిని దర్శించుకోవాలి.

– వేమూరి సోమేశ్వరశర్మ, పంచారామ క్షేత్ర అభిషేక పండితులు, సామర్లకోట

9న నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం



దవులూరి దొరబాబు

సామర్లకోట: ఈనెల 9న పెద్దాపురం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ కోఆర్డినేటర్, మాజీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న పూర్ణా కల్యాణ మండపంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. చంద్రబాబు ఎన్నికల హామీల అమలులో విఫలమయ్యారని ఈ అంశాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ కార్యక్రమం ప్రారంభించేందుకు నియోజకవర్గ పార్టీ సమావేశంలో పార్టీ శ్రేణులతో చర్చిస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు హాజరు కావాలన్నారు. ఆయా గ్రామాలు, వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ నాయకుల దృష్టికి తీసుకురావాలన్నారు.

విష్ణుమూర్తికి నేడు ప్రత్యేక పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో వేంచేసియున్న విష్ణుమూర్తికి ఆషాఢ మాసం, ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఈఓ బళ్ల నీలకంఠం శనివారం తెలిపారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

జోరుగా వరి నాట్లు



పీబీ దేవంలో నాట్లు వేస్తున్న బిహార్ కూలీలు

సామర్లకోట: మండల పరిధిలో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. పీబీ దేవం, జి. మేడపాడు, వేట్లపాలెం ఎత్తిపోతల పథకాల పరిధిలో సాగవుతున్న భూముల్లో వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో 90 శాతం వరకు రైతులు వెదజల్లు పద్ధతిలో వరి సాగు చేసేవారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 50 శాతానికి మించి రైతులు కూలీలతో వరి నాట్లు వేయించడానికి మక్కువ చూపుతున్నారు. మండల పరిధిలో వరి పంట భూముల్లో వెదజల్లు విధానంలో పూతిక కేళీ ఎక్కువగా వస్తుందనే ప్రచారంతో రైతులు కూలీలతో నాట్లు వేయిస్తున్నారు. సుమారు నెల రోజుల క్రితమే బీహార్ నుంచి వ్యవసాయ కూలీలు మండలానికి చేరుకున్నారు. బిహార్ వాసులు తక్కువ కూలీకి ఎక్కువ పని చేస్తున్నారని రైతులు తెలిపారు. ఎకరం పంట భూమిలో నాట్లు వేసేందుకు 12 మంది కావలసి ఉండగా బిహార్ కూలీలు ఏడుగురు నాట్లు వేస్తున్నారని రైతులు తెలిపారు. దీనికి తోడు రెండు నుంచి మూడు కుదుళ్లతో నాట్లు వేయడం వలన దిగుబడి పెరుగుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. మండలానికి చెందిన కూలీలు 10 నుంచి 15 కుదుళ్లతో నాట్లు వేయడం వలన వరి ఆకు ఎక్కువ అవసరమవుతుందని వారన్నారు. బీహార్ నుంచి వచ్చిన కూలీలకు ఆయా గ్రామాల్లో తాత్కాలికంగా షెడ్లు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నారు.

ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీ పోరాటం

- 7న వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశం
- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత



నాయకులతో మాట్లాడుతున్న వంగా గీతా విశ్వనాథ్

పిఠాపురం: ఈనెల 7వ తేదీ సోమవారం పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ విస్తత స్థాయి సమావేశం గొల్లప్రోలు సత్యకృష్ణ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీతావిశ్వనాథ్ తెలిపారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహణపై నాయకులతో సమీక్షించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 9:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఆయనతో పాటు కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, పార్లమెంట్, అసెంబ్లీ కోఆర్డినేటర్లు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొంటారన్నారు. ఈ సమావేశానికి పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సంస్థాగత ప్రతినిధులు, అనుబంధ సంస్థల ప్రతినిధులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి ముఖ్య నాయకులందరూ హాజరవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్స్, కోఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు, మండల పరిషత్ వైస్ చైర్మన్లు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్, వైస్ సర్పంచులు, వార్డు సభ్యులు పార్టీ శ్రేణులందరూ హాజరు కావాలన్నారు.

ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిందన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రజల తరుపున పోరాటం చేయడానికి పార్టీ పెద్దలు దిశానిర్దేశం చేస్తారన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వివిధ అంశాలపై సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. పార్టీ తరుపున ప్రజలకు అండగా ఉండి వారికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో మొక్కలు నాటిన బ్యాంకు అధికారులు, ఉపాధ్యాయులు

సామర్లకోట: పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో కెనరా బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రహదారుల విస్తరణ పనుల్లో భాగంగా భారీ వృక్షాలను తొలగించవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని, దాని కారణంగా వాతావరణంలో కాలుష్యం పెరిగిపోతోందని చెప్పారు. ప్రతి ఇంటి వద్ద కనీసం రెండు మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. బ్యాంకు అధికారులు పాఠశాల ఉపాధ్యాయులకు మొక్కలను అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు అనుదీప్, సిబ్బంది అమిత్, శ్రీరామ్, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు ఎస్ హరినాథ్, బాలశైలజ, బేబీ రాణి, పీడీ పి.సుధారాణి పాల్గొన్నారు.

రేషన్ డీలరుకు షోకాజ్ నోటీసు

సామర్లకోట: పట్టణ పరిధిలోని 61వ రేషన్ డీలరుకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. శనివారం ఫ్రస్టేషన్ అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఒక వృద్ధురాలు కిలోమీటరు దూరంలో ఉన్న రేషన్ షాపు నుంచి బియ్యం నెత్తిన పెట్టుకుని బాధపడుతూ వస్తున్న విషయాన్ని కథనంలో వివరించడంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. రేషన్ డీలరుకు షోకాజ్ నోటీసు జారీ చేయడంతో పాటు డీలరుషిప్‌ను తొలగించి పక్కషాపు డీలర్‌కు బాధ్యతలు అప్పగించాలని ఎంఎస్‌ఓకు సూచించినట్టు తహసీల్దార్ తెలిపారు. మహిళా సంఘాన్ని గుర్తించి రేషన్ షాపు వారికి కేటాయించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. దీనిపై డీలరు నుంచి లిఖిత పూర్వకంగా సమాధానం తీసుకుంటామన్నారు. 65 ఏళ్లు దాటిన వృద్ధుల ఇళ్లకు వెళ్లి రేషన్ సరకులు ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయని ఆయన తెలిపారు. ఈ ఆదేశాలను పాటించని డీలర్లపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు.

పెండింగ్ కేసుల పరిష్కార వేదికగా లోక్ అదాలత్

జాతీయ లోక్‌అదాలత్‌లో 175 కేసుల పరిష్కారం



జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయమూర్తి

పిఠాపురం: పెండింగ్ కేసులు పరిష్కార వేదికగా లోక్ అదాలత్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీహరి అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం పిఠాపురం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కోర్టుకు వచ్చే కక్షిదారులకు అవగాహన కల్పించారు. పెండింగ్ కేసులు పరిష్కరించేందుకు ఇరువర్గాలు రాజీ కుదుర్చుకుని రాజీమార్గం ద్వారా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం లోక్ అదాలత్‌ల ద్వారా మూడు కోర్టుల్లో 340 కేసులకు, 175 కేసులను న్యాయమూర్తులు పరిష్కరించారు. 12వ అదనపు జిల్లా జడ్జి ఎం శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లలో సీనియర్ సివిల్ జడ్జి యం.బాబు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి యం . విజయరామేశ్వరి కేసులను పరిష్కరించారు. ఇందులో ఎమ్‌వీఓపీ - 22 కేసులు, సివిల్- 37 ,క్రిమినల్ 115, బ్యాంకునకు సంబంధించిన ఒక కేసును పరిష్కరించారు. రూ 1.40 కోట్లకు సంబంధించిన కేసులకు పరిష్కారం చూపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేరుగా రాజారావు, సీనియర్ న్యాయవాదులు బీవీఎస్ఎస్ రాజు, ఏకేవై రెడ్డి, ఆలీ, గోపాలకృష్ణ, శ్రీరామచంద్రమూర్తి, జి.డి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 429 కేసులు పరిష్కారం

పెద్దాపురం: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయస్థాయి లోక్ అదాలత్‌లో 429 కేసులు పరిష్కరించినట్లు ఏడవ అదనపు జిల్లా జడ్జి చంద్రమౌళీశ్వరి తెలిపారు. శనివారం స్థానిక కోర్టు మూడు బెంచ్‌ల్లో మొదటి బెంచ్‌లో న్యాయమూర్తులు చంద్రమౌళీశ్వరి, కేఎంఎల్ గణేష్, రెండవ బెంచ్‌కు సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ దైవకృప, మూడవ బెంచ్‌కు జూనియర్ సివిల్ జడ్జి ఎల్.దేవిరత్నకుమారి కేసులు పరిష్కరించారు.ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం నాయకులు నూతలపాటి అప్పలకొండ, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

రాక్ సిరామిక్స్‌లో కార్మికుల తొలగింపు దారుణం



రాక్ సిరామిక్స్ ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులో ఉన్న రాక్ సిరామిక్స్‌లో పని చేస్తున్న కార్మికులను తొలగించడం దారణమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ అన్నారు. రాక్‌సిరామిక్స్‌లో పని చేస్తున్న కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. కార్మికుల తొలగింపునకు నిరసనగా ఫ్యాక్టరీలో నిర్వహిస్తున్న ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాక్ సిరామిక్స్ పరిశ్రమలో తరచూ కార్మికులను తొలగించడం ఒక అలవాటుగా మారిందని ఆరోపించారు. గతంలో 12 మందిని తరువాత 28 మందిని, ప్రస్తుతం 90 మంది కార్మికులను తొలగించాలని నిర్ణయించడం చాలా దారణమన్నారు. ప్రధానంగా పెద్దాపురం, సామర్లకోటలలో నివాసం ఉంటున్న కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కుటుంబ కథా చిత్రాల నిర్మాణం ఎంతో అవసరం



శృంగార వల్లభ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దర్శక, నిర్మాత ప్రతాప్‌రెడ్డి

పెద్దాపురం: సంప్రదాయ, కుటుంబ కథా చిత్రాల నిర్మాణం ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమని ప్రముఖ రచయిత, దర్శకులు భీమవరపు ప్రతాప్ రెడ్డి (హైదరాబాద్) అన్నారు. స్వయంభూ తొలి తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయంలో శనివారం ఆయన కో–డైరెక్టర్ మేడపాటి శ్రీనివాసరావుతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈఓ వడ్డి శ్రీనివాస్‌తో కలసి వారు మాట్లాడుతూ శృంగార వల్లభ స్వామి ఆలయ చరిత్రతో సంప్రదాయ, కుటుంబ కథా చిత్రాన్ని త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నామన్నారు. 1986లో తాను సినీ రంగంలో అడుగుపెట్టి తమిళ నటుడు గణేష్ హీరోగా, హీరోయిన్లు మాధవి, సిల్క్‌స్మితతో కలసి రుద్రనారి సినిమాలో నటించానన్నారు. విజయశాంతి, చంద్రమోహన్ నటించిన పెళ్ళిచూపులు సినిమాతో పాటు విముక్తి కోసం, విప్లవ శంఖం సినిమాలకు దర్శకత్వం వహించినట్టు తెలిపారు. తాను రచయితగా, నిర్మాతగా, తండ్రి ప్రధాన పాత్రలో నటించిన ఓతండ్రి తీర్పు ఇటీవల 2024 డిసెంబర్ 27న విడుదలై తెలంగాణ రాష్ట్రం అంతా మంచి ఆదరణ పొందిందన్నారు. త్వరలోనే ఏపీలో ఈ సినిమాను విడుదల చేస్తామని ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మరి కొద్దిపాటి సమయంలోనే వైజాగ్, రాజమహేంద్రవరం, యానాం తదితర ప్రాంతాల్లో నూతన నటీనటులతో 'రఘు సంకల్పం' చిత్ర నిర్మాణానికి షూటింగ్ లొకేషన్ పరిశీలనకు ఈ ప్రాంతానికి వచ్చి స్వయంభూ తిరుపతి శృంగార వల్లభ స్వామిని దర్శించుకున్నట్టు తెలిపారు. త్వరలో ఇదే ఆలయంలో షూటింగ్ మూహూర్తపు షాట్‌తో ×రఘు సంకల్పం× చిత్రం షూటింగ్ ప్రారంభించనున్నట్టు దర్శకులు, నిర్మాత ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట కో–డైరెక్టర్ మేడపాటి శ్రీనివాసరావు, ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్, నటులు శర్మ తదితరులున్నారు.

గ్రామ సభలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం



తిమ్మాపురం గ్రామ సభలో ఇరువర్గాలతో చర్చిస్తున్న అధికారులు

కాకినాడ రూరల్: గ్రామ అభివృద్ధికి సంబంధించి చేపట్టవలసిన పనులకు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరణ, పంచాయతీ తీర్మానాలు కోసం కాకినాడ రూరల్‌లో శనివారం తిమ్మాపురం, నేమాం, పండూరులో గ్రామ సభలు నిర్వహించారు. తిమ్మాపురంలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, నేమాంలో సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, పండూరులో ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు రామన్న చౌదరి, మోహన్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పంచాయతీ సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులు తీర్మానాలు చేశారు. తిమ్మాపురంలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో చెరువు వేలం పాట సొమ్ము పాటదారుడి నుంచి వసూలు విషయమై ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్య తీసుకున్నారు. గ్రామ సభలో వైస్ ఎంపీపీ బందిలి వీరిష, ఎంపీటీసీ ముద్దన వెంకట్రాజు, పంచాయతీ సభ్యులు, గ్రామస్తులు తాతాజీ, రాజా పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో అధికారుల సర్వే

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో పూర్వం బర్మా కాందిశీకుల సొసైటీకి కేటాయించిన భూములు చేతులు మారడంతో అందులో ఉన్న భవనాలను ఇటీవల కూల్చివేశారు. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో అధికారులు రంగప్రవేశం చేశారు. బర్మా కాందిశీకుల సొసైటీ నుంచి ఎస్సీ కార్పొరేషన్‌కు ఎకరం స్థలం కాందిశీకుల స్వయం ఉపాధి కోసం సెరికల్చర్ డిపార్టుమెంట్‌కు అప్పట్లో అప్పగించడంతో వాటిలో భవనాలు నిర్మించి పట్టు గూళ్ల తయారీ పరిశ్రమను నిర్వహించారు. కాలక్రమేణా పట్టు గూళ్ల తయారీ మూతపడడంతో భవనాలు నిరుపయోగంగా మారాయి. విలువైన స్థలం రికార్డులు చేతులు మారడంతో ప్రైవేట్ వ్యక్తులు భవనాల తొలగింపును ఇటీవల చేపట్టగా ప్రజల నుంచి అధికారులకు ఫిర్యాదులు అందడంతో బ్రేక్ పడింది. శనివారం ఎస్సీ కార్పొరేషన్ ఏఈఓ వీవీఎస్ఎన్ మూర్తి, సిబ్బంది, సెరికల్చర్ జిల్లా అధికారి పాల్‌రాజు, సిబ్బంది సమక్షంలో మండల సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వోలు పి. శ్రీనివాస్, తదితరులు భవనాలు కూల్చిన స్థలంలో సర్వే చేశారు. సర్వే వివరాలను జిల్లా అధికారులు, ఎస్సీ కార్పొరేషన్, సెరికల్చర్ డిపార్టుమెంట్లకు అందజేస్తామని సర్వేయర్ రామకృష్ణ తెలియజేశారు. బర్మా కాందిశీకుల కుటుంబానికి చెందిన సాయి తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

13న కవల పిల్లల సమ్మేళనం

బాలాజీచెరువు: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జూలై 13న ఆదివారం కవల పిల్లల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఇంటర్నేషనల్ అడ్మిన్‌వైస్ ప్రెసిడెంట్ నాళం అండాళ్ శనివారం తెలిపారు. స్థానిక సినిమారోడ్డులోని సూర్య కళా మందిరంలో కవల పిల్లల పెంపకం, వారి జీవనశైలి, సంప్రదాయ వస్త్రధారణ, స్టోరీ టెల్లింగ్, డ్యాన్స్‌కు సంబంధించి ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతి, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ జ్ఞాపిక అందజేస్తామన్నారు. 25 ఏళ్లలోపు గల కవల పిల్లలు పాల్గొనవచ్చని, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎరుకుల రామకృష్ణ పాల్గొంటారన్నారు.పేర్లు నమోదు కోసం 9866003633 నంబరుకు సంప్రదించవచ్చన్నారు.